
సాక్షి ఒడిశా

సోమవారం । 17 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు: రూ.10.09.519

బంగారం: 23 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

వెండి: 42 గ్రాముల 450 మిల్లీ గ్రాములు



ఉల్లాసంగా..ఉత్సాహంగా..

రాయగడలోని సంస్కృతి మహిళా అనుష్టాన్ ఆధ్వర్యంలో బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో రొజ్జొ వేడుకలు వైభవంగా జరిగాయి. - 8లో



నష్టాల్లో పైనాపిల్ యూనిట్లు

ప్రస్తుత సీజన్‌లోవిరివిగా లభించే పైనాపిల్ పండ్లకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

మాజీ గవర్నర్ భండారే కన్నుమూత



మురళీధర్ చంద్రకాంత భండారే (ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ గవర్నర్ మురళీధర్ చంద్ర కాంత భండారే(95) శనివారం కన్ను మూశారు. ఆయన మృతి పట్ల ప్రస్తుత రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, ముఖ్యమంత్రి చంద్రమోహన్ మాఝీ, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు. భండారే రాష్ట్ర ప్రజల ప్రియతమ గవర్నర్‌గా మన్ననలు పొందారు. ప్రధానంగా చిన్న పిల్లలతో ముచ్చటించి ఆయన సాధారణ ప్రజానీకానికి చేరువయ్యారు. 2007 ఆగస్టు 21 నుంచి 2013 మార్చి 9 వరకు గవర్నరుగా కొనసాగారు. 1928 డిసెంబరు 10న జన్మించిన భండారే రాజనీతిజ్ఞుడుగా పేరుగాంచారు. 1980 నుంచి 1995 వరకు కాంగ్రెస్ అభ్యర్థిగా మహారాష్ట్ర రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదిగా రాణించారు. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్‌కు వరుసగా రెండు సార్లు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

బండారు ఘరణి మందిరానికి కొత్త సొబగులు



బండారు శక్తి పీఠం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఏకైక శక్తి పీఠం బండారు ఘరణి మందిరం సరికొత్తగా దర్శనమిస్తోంది. శనివారంతో మరమ్మతులు పూర్తవ్వడంతో పరదాలు తొలగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెద్దపురం మేస్త్రులు ముఖ ద్వారం నిర్మించగా నయాగడ్ జిల్లా శిల్పులు కొత్త రంగులు వేశారు. దాంతో శిఖరం అద్భుతంగా దర్శనమిస్తోంది. ప్రభుత్వం అందజేసిన రూ.90 లక్షల నిధులతో ఈ నిర్మాణాలు పూర్తయ్యాయి. దాంతో భక్తులు దేవాలయ సందర్శనకు తరలివస్తున్నారు.

గంజాయి పట్టివేత



గంజాయి బస్తాలను గుర్తించిన పోలీసులు

కొరాపుట్/జయపురం: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కొరాపుట్ జిల్లా నందపూర్ ఎస్‌డీపీఓ కార్యాలయం పరిధిలోని పాడువ పోలీసులు తనిఖీలు చేపడుతుండగా చటువ సమీపంలో గంజాయి అక్రమ రవాణాకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే వెళ్లి పరిశీలించగా పులికుండ అటవీ ప్రాంతంలో గంజాయి గుర్తించారు. పిచ్చి మొక్కల మధ్య దాచిన 220 కేజీల గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ టి.సబర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

కార్యకర్తలకు పరామర్శ



కార్యకర్తలను పరామర్శిస్తున్న రమేష్ మజ్జి

కొరాపుట్: అనారోగ్యం పాలైన బిజూ జనతా దళ్ కార్యకర్తలను పార్టీ నబరంగ్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర మజ్జి పరామర్శించారు. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కుడి గ్రామానికి చెందిన ధనా నాయక్ కొంతకాలంగా ధనా నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన్ను శనివారం రమేష్ పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు.



నియోగుల సంఘం ప్రముఖులతో సమావేశమైన శ్రీమందిరం ప్రధాన పాలనాధికారి వీర్ విక్రమ్ యాదవ్

స్నానయాత్రకు సన్నాహాలు

- నేడు పూరీ జగన్నాథుని ఆలయం వద్ద రాజేంద్ర అభిషేకాలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



సిద్ధమవుతున్న రథాలు (ఫైల్)

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని వార్షిక రథయాత్ర సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. రథ యాత్రలో భాగంగా పరిగణించే స్నానయాత్రకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 22న దేవ స్నాన పూర్ణిమ పురస్కరించుకుని యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి స్నానయాత్ర ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. సోమవారం రాజేంద్రాభిషేకంతో ప్రారంభమయ్యే క్రతువులను సజావుగా నిర్వహించేందుకు 36 నియోగుల సేవాయత్‌ల సహకారాన్ని జగన్నాథ ఆలయ పరిపాలనా విభాగం (ఎస్‌జేటీఏ) కోరింది. జ్యేష్ఠ పూర్ణిమ నాడు జగన్నాథ స్వామి, బలభద్రుడు, దేవీ సుభద్రల స్నానోత్సవం సందర్భంగా ఆదివారం నియోగుల సేవాయత్ ప్రముఖులతో ఆలయ అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సమావేశమైంది. శ్రీ మందిరం ప్రధాన పాలనాధికారి(సీఏఓ) వీర్ విక్రమ్ యాదవ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. స్నానోత్సవం క్రతువుల్ని నిర్ధారిత వేళల ప్రకారం సకాలంలో పూర్తి చేయడంలో సేవాయత్ వర్గం పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

స్నానయాత్ర కార్యక్రమాలివే..

సేవాయత్ ప్రతినిధి ప్రముఖుల సంప్రదింపులతో ఈ ఏడాది జరగనున్న జగన్నాథ స్వామి స్నాన యాత్ర కార్యక్రమాల వేళల్ని ఖరారు చేశారు. ఆ రోజున పహండి ఉదయం 4 నుంచి 6 గంటల మధ్య శ్రీ మందిరం గర్భగుడి రత్న వేదిక పైనుంచి స్నాన మండపానికి మూల విరాటుల తరలింపు ముగించాలని నిర్ణయించారు. ఈ వ్యవధిలో అనుబంధ సేవాదులు పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఛేరా పొంహరా, 2.40 గంటలకు గజానన అలంకరణ (హత్తి బేషా), సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు స్నాన మండపంపై మూల విరాట్ల సర్వ దర్శనం, రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు స్నాన మండపం నుంచి అంతరాలయానికి మూల విరాట్ల తరలింపు (బహుడా పొహిండి), అర్ధరాత్రి 1.30 గంటలకు బంగారు బాసికం (నుదుటి ఆభరణం), రాహురేఖా మైలం సేవలకు వేళల్ని ఖరారు చేశారు. స్నానోత్సవం భారీ ఘట్టం. ప్రతిపాదిత వేళల ప్రకారం క్రతువులు ముగియడంలో స్వల్ప తేడాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

భక్తులకు ప్రాధాన్యత..

మూల విరాటుల స్నానోత్సవం పురస్కరించుకుని భక్తులు, యాత్రికులు తండోపతండాలుగా తరలి వస్తారు. రద్దీ నియంత్రణతో సులభ దర్శనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి వీర్ విక్రమ్ యాదవ్ తెలిపారు.

నిత్యానంద గొండోకు కీలక శాఖలు



మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ఏకైక మంత్రిగా ఉన్న నిత్యానంద గొండోకి నూతన మంత్రివర్గంలో సుముచిత స్థానం లభించింది. ముఖ్యమంత్రి మెహన్ చరణ్ మజ్జి ప్రకటించిన జాబితాలో అనేక శాఖలు లభించాయి. రాష్ట్ర స్కూల్స్, మాస్ ఎడ్యుకేషన్, సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమం, సామాజిక భద్రత, దివ్యాంగుల ఉపాధి అభివృద్ధి, హరిజన, గిరిజన శాఖలు లభించాయి. వీటితో పాటు క్యాబినెట్ హోదా కల్పించారు. భారీగా పదవులు రావడం పట్ల అవిభక్త కొరాపుట్ జిల్లాలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వెనుక బడిన అవిభక్త కొరాపుట్ జిల్లాలు షెడ్యూల్డ్ ప్రాంతంలోనివి. ఇక్కడ 90 శాతం పైగా ప్రజలు గిరిజనులే. ఈ నేపథ్యంలో నిత్యానందకు పదవులు దక్కడంతో జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కేరళ దంపతులకు శిశువు దత్తత



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా పోష్య సంతాన పునరావాస కేంద్రంలో 58వ శిశువును జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ఆదివారం కేరళ దంపతులకు దత్తతగా అందజేశారు. తల్లిదండ్రులకు దూరమైన అనాథ శిశువులను చేరదీసి స్థానిక ప్రభుత్వ పోష్య సంతాన పునరావాస కేంద్రంలో ఉచితంగా విద్య, వైద్య, ఆహార సౌకర్యాలు కల్పిస్తున్నారు. కేంద్ర నిస్సాన్ సలోం పోర్టల్‌లో కేరళ రాష్ట్రం కోల్లాం గ్రామానికి చెందిన దంపతులు దరఖాస్తు చేసుకోగా మగశిశువును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సురక్షా యూనిట్ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, నిస్సాన్ సలోం సంస్థ పర్యవేక్షకులు ప్రత్యూష్ కుమార్ సూర్య, జిల్లా శిశు సంరక్షణ కమిటీ సభ్యులు, స్వతంత్ర పోష్య సంతాన కేంద్రం కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి పాలైన బతుకులు



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

- మట్టి చరియలు విరిగిపడి ముగ్గురు యువతులు మృతి
- లవిరిగుడలో ఘటన



మట్టిని తొలగిస్తున్న జేసీబీ

కొరాపుట్/జయపురం: మట్టి చరియలు విరిగిపడి ముగ్గురు యువతులు మృతి చెందిన ఘటన ఆదివారం కొరాపుట్ సదర్ పరిధిలోని కొలాబ్‌నగర్ సమీపంలో లవిరిగుడ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలోని అక్రమ మట్టి క్వారీ ద్వారా కొన్నాళ్లగా మట్టిని తరలిస్తున్నారు. సమీపంలోని బొడకెరంగా గ్రామ పంచాయతీ నల్మన్‌గుడకు చెందిన ఆరుగురు కార్మికులు మట్టి తీస్తుండగా ఒక్కసారిగా మట్టి చరియలు విరిగిపడ్డాయి. వారంత మట్టి కింద చిక్కుకుపోయారు. వెంటనే స్థానికులు గుర్తించి నలుగురిని వెలికి తీశారు. అప్పటికే సల్వర్ జాని(18), చంపావతి నాయక్ (18), పుర్ణి నాయక్ (18) అనే యువతులు మృతి చెందారు. బాధితులను కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీలతో మట్టిని తొలగించారు. కార్యకర్తల ఊరేగింపులో ఉన్న కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయిస్తామని ప్రకటించారు.

- మజ్జిగౌరి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- కనీస సౌకర్యాలు లేక మండుటెండలో పాట్లు



మజ్జిగౌరి అమ్మవారు

పోటెత్తిన భక్తజనం



ఎండలో బారులు తీరిన భక్తులు

రాయగడ: భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి, రాయగడ ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి మందిరానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము 3 గంటల నుంచే భక్తుల తాకిడి మొదలైంది. మండుటెండలోనూ అమ్మవారి దర్శనానికి గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. సుమారుగా 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. అయితే భక్తులకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లాపాపలతో ఎండలో గంటల తరబడి వేచి ఉన్నా కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఆలయ కమిటీ కల్పించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. దర్శనానికి ఏడు గంటల సమయం పట్టిందని, వీఐపీ టిక్కెట్లు లేకపోవడంతో అంతా ఉచిత దర్శనానికి లైన్‌లో వెళ్లడంతో ఈ సమస్య ఎదురయ్యిందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కొందరు భక్తులు భారీ క్యూలైన్‌లను చూసి ఆలయం బయటే అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆరుబయటే అమ్మవారి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి సత్కారం



ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహితో గజపతి చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

పర్లాకిమిడి: గజపతి చాంబర్ ఆఫ్ కామర్స్ బృందం నూతనంగా ఎన్నికైన పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిని ఆదివారం హైటెక్ ప్లాజాలో కలిసి అభినందనలు తెలియజేశారు. గజపతి చాంబర్స్ కామర్స్ అధ్యక్షుడు పాట్నూరు రామకృష్ణ, పైడిశెట్టి సుధ, అంధవరపు బాలాజీ, పాట్నూరు హరి, జామి సోమేశ్వరరావు, మహేష్ తదితరులు మాట్లాడుతూ పర్లాకిమిడిలో గజపతి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం నిర్మించడానికి స్థలం కేటాయించాని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

బావమరిదిని కాల్చిచంపిన బావ



మృతుడు కైలాష్ నాయక్ (ఫైల్)

పర్లాకిమిడి: సొంత బావ మరిదిని నాటుతుపాకీతో కాల్చి చంపిన ఘటన గజపతి జిల్లా బలియాగోటి గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. మోహానా పోలీస్ స్టేషన్ పరిధిలోని బలియాగోటి గ్రామంలో కైలాష్ నాయక్ (56) శనివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి కట్టెలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మోహానా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, బంధువులు అటవీ ప్రాంతంలో వెతకగా కైలాష్ నాయక్ మృతదేహం కనుగొన్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా పాతకక్షలతో సొంత బావ ఉదయ్ నాయక్ ఈ హత్య చేసినట్లు తేలడంతో అరెస్టుచేశారు. నిందితుడి నుంచి నాటుతుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం



ఎంపీ, ఎమ్మెల్యేలను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

- కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి
- రాయగడలో విజయోత్సవ ర్యాలీ



ఎంపీ సప్తగిరికి పెయింటింగ్ బహూకరిస్తున్న అభిమానులు

రాయగడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొరాపుట్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించిందని, త్వరలోనే రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రాయగడ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు మంచి రోజులు రానున్నాయని చెప్పారు. ఎంపీగా మరోసారి తనను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక సమస్యలపై నిరంతరం పోరాడతానని చెప్పారు. కాంగ్రెస్ కంచుకోటగా నిలిచిన అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఇకపై కాంగ్రెస్ కోటను మరింత పటిష్టపరిచేందుకు కృషి చేస్తామన్నారు. బీజేడీ నేతలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా ప్రజలు నమ్మలేదన్నారు. అంతకుముందు మజ్జిగౌరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అప్పలస్వామి కద్రక (రాయగడ), నీలమాధవ హికక (బిసంకటక్), సత్యజీత్ గొమాంగొ (గుణుపూర్), రామచంద్ర కడమ్ (పొట్టంగి), పవిత్ర సావుంతా (లక్ష్మీపూర్)లు దర్శించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభావేదిక వద్ద ఎంపీ సప్తగిరికి అభిమానులు చిత్రాన్ని బహూకరించారు. కాశీపూర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేలను గజమాలతో సత్కరించారు.



పట్టుబడిన నిందితులతో పోలీసులు

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసులు చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వీరి నుంచి బొలేరో వాహనం, 5 బ్యాటరీలు, 3 షట్టర్ ప్లేట్లు, 40 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజులుగా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను దొంగతనం చేసి స్పేర్ పార్టులు, డీజిల్ చోరీ చేయడం వంటి కేసులు తరచూ జరుగుతుండటంతో నిఘా వేసిన పోలీసులు వీరిని పట్టుకున్నారు.

క్లుప్తంగా

విక్రమదేవ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


మోణి

శశాంకరాజ్

సాయిదీక్ష

జయపురం: శనివారం విడుదలైన +3 పరీక్షా ఫలితాలలో జయపురం విక్రమదేవ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. సైన్స్ విభాగంలో 72 శాతం, ఆర్ట్స్ విభాగంలో 68 శాతం, కామర్స్ విభాగంలో 55 శాతం ఫలితాలు సాధించారు. ప్రథమ శ్రేణిలో 48 మంది, ద్వితీయ శ్రేణిలో 100 మంది పాసయ్యారు. పీజీ ఫలితాలలో 89 శాతం ఫలితాలు సాధించారు. ఆర్ట్స్‌లో బిజేత మోణి, సైన్స్‌లో టి.సాయిదీక్ష, కామర్స్‌లో జి.శశాంకరాజ్‌లు టాపర్లుగా నిలిచారు.

పొంచి ఉన్న ప్రమాదం


ఇనుప వంతెనపై ప్రమాద ఘంటికలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి సారుగుడ వద్ద కాలువపై ఇనుప వంతెన ప్రమాదకరంగా మారింది. పైభాగంలో ప్లేట్లకు బోల్టులు ఊడిపోతున్నాయి. దీంతో ప్లేట్లు వదులుగా మారడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లేట్లు సరిచేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం ప్రారంభం


ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో జ్యేష్ఠ మాసం ఆదివారం మొదటి రోజు రాత్రి శ్రీముఖలింగేశ్వర సహిత వారాహి అమ్మవారి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజతో ప్రారంభమై ఘనంగా ధ్వజారోహణ జరిగింది. పుణ్యాహవచనం, మంటపారాధన, బలిహరణ నిర్వహించి మంగళం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రభాకరరావు, అర్చకులు, చలం, నాయుడుగారి రాజశేఖర్, శ్రీకృష్ణ శివాజీ తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'రైతులకు సరిపడా విత్తనాలు అందించాలి'

కాశీబుగ్గ: రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు తక్షణమే సరఫరా చేయాలని, అందులో సబ్సిడీ వర్తించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు అన్నారు. మందస మండలం రట్టి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు సరిపడా విత్తనాలు ఏ రకం అవసరమో ఆర్‌బీకేల్లో సమాచారం ఉందని, అదే విధంగా విత్తనాలు అందించాలని కోరారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ పెట్టుబడులకు రూ.20వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో వేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో జీడి పిక్కల కొనుగోలు జరగడం లేదని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కాలువలు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, గురయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

యూబీ ఉద్యోగులపై దాడి

రణస్థలం: మండలంలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమ ఉద్యోగులపై దాడి చేసిన ఘటనలో 10మందిపై యూబీ యాజమాన్యం ఫిర్యాదు చేసిందని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు. ఫిర్యాదులో తెలిపిన వివరాలు ప్రకారం.. యూబీ పరిశ్రమ యూనిట్ హెడ్ డి.రామకృష్ణ, ఉద్యోగులు ఎం.ఎల్ రావు, బి.రవికుమార్, కె.అప్పలరెడ్డి, జి. క్రిష్ణంరాజు, టి.ఈశ్వరరావులపై శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో దాడి జరిగింది. ఎన్‌బీఎస్, టీఎఆర్, ఎంఎన్‌ఆర్ కాంట్రాక్టర్లు టి.అప్పారావు, ఎస్.గంగులు, కె.మహాలక్ష్మి, వై.చిన్నారావు, కాకి చిన్నారావు, ఎస్.ఈశ్వరరావు, ఎస్.వెంకటరమణ, ఎస్.లక్ష్మణరావు, కె.బలరాం, వై. మహాలక్ష్మిలు దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీళ్లతో పాటు మరో 40 మంది వరకు లోపల కార్మికులు, బయట వ్యక్తులు పరిశ్రమ గేటు నుంచి లోపలికి ప్రవేశించారని తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు చెప్పారు.


వేడుకల్లో పాల్గొన్న రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

రాయగడలోని సంస్కృతి మహిళా అనుష్ఠాన్ ఆధ్వర్యంలో ఆదివారం బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో రొజ్జొ వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక మాట్లాడుతూ ఒడియా మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే రొజ్జొ ఉత్సవాలు సమైక్యతకు అద్దంపడతాయని చెప్పారు. అనుష్ఠాన్ అధ్యక్షురాలు సుజాత పాలో మాట్లాడుతూ ఏటా తమ సంస్థ ద్వారా మహిళలను ఉత్సాహపరిచేందుకు రొజ్జొ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మెహందీ, ముగ్గుల పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. – రాయగడ


మెహందీ పోటీలో మహిళలు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు


రొజ్జొ వేడుకల్లో మహిళల సందడి


చిన్నారుల నృత్య విన్యాసం

చురుగ్గా జగన్నాథ రథ నిర్మాణాలు

కొరాపుట్: దక్షిణ ఒడిశా పూరి దివ్య ధామంగా పిలిచే కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీజగన్నాథ క్షేత్రం వద్ద రథం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని సిమిలిగుడ రోడ్డు దేవదాయ శాఖ అధికారులు ఇటీవలే ప్రారంభ పూజలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. సవరలు పూజించే జగన్నాథుడు కనుక శబర శ్రీక్షేత్రంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. కొరాపుట్‌లో జగన్నాథుడు, బలబద్ర, సుభద్రలకు ప్రత్యేక రథాలు ఉంటాయి. సుభద్ర రథాన్ని మహిళలు లాగుతూ గుండిచా మందిరం వరకు తోడ్కొని వెళ్తారు. జూలై 7న జరిగే రథయాత్రకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ముమ్మరం చేశారు.


రథం తయారీని పర్యవేక్షిస్తున్న సిబ్బంది


రథం సామగ్రి

చెట్టును ఢీకొన్న బైక్

● ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన సుశాంత హరిజన్


చికిత్స పొందుతున్న ఘశీ సాంత


గాయపడిన రోహిణీ సాంత

జయపురం: అదుపుతప్పిన ఓ బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయాలపాలయ్యారు. బొయిపరిగుడ సమితి పొడైయ్‌గుడ గ్రామానికి చెందిన సుశాంత హరిజన్(18), ఘశీ సాంత, రోహిణి సాంతలు ఒకే బైక్‌పై దండాబడి పంచాయతీ కండికగుడ గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి శనివారం రాత్రి 10 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఛుడాయగుడ జంక్షన్ వద్ద మలుపులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుశాంత హరిజన్ మృతి చెందినట్లు రామగిరి పోలీసు అధికారి బలరాం హికాక తెలిపారు. మిగిలిన ఇద్దరిలో రోహిణి సాంతను మెరుగైన వైద్యం నిమిత్తం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్‌కు తరలించినట్లు చెప్పారు. సుశాంత హరిజన్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

నిర్లక్ష్యం నుంచి నీడ కిందకు..


ఎట్టకేలకు బాగైన మధుసూదన్ దాస్ విగ్రహం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జగన్నాథ మందిర్ జంక్షన్ వద్ద ఉత్కళ గౌరవ్ మధుసూదన్‌దాస్ విగ్రహం చాలా రోజులుగా నిర్లక్ష్యపు నీడలో ఉండేది. విగ్రహానికి నీడనిచ్చే గొడుగు విరిగిపోయి చుట్టూ టైల్స్ పాడై శిథిలావస్థకు చేరుకుంది. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన ఐకాన్స్ ఇన్ మొషన్స్ అనే స్వచ్ఛంద సంస్థ యువకులు విగ్రహాన్ని బాగు చేసి గొడుగు సరిచేసి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు.


నాడు శిథిలావస్థలో ఉన్న విగ్రహం(ఫైల్)

మహేంద్రగిరిపై అఖిల భారత సాధువుల సమ్మేళనం


కుంతీ మందిరం వద్ద సాధువులు

పర్లాకిమిడి: మహేంద్రగిరి పర్వతంపై వెలసివున్న కుంతీ మందిరం వద్ద ఆదివారం అఖిల భారతీయ సాధు సంతవుల సమ్మేళనం జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సాధువులంతా ఇక్కడికి చేరుకున్నారు. గజపతి జిల్లా రాయగడ బ్లాక్‌లో ఉన్న పవిత్ర మహేంద్రగిరిని పర్యాటక కేంద్రంగా పరిరక్షించాలని, పురాతన మందిరాలు కాపాడాలని ఒడిశా సీఎం మోహన్ మఝి, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు వినతిపత్రాలు అందజేయాలని దేవిమఠం మహంత రామానంద్ దాస్, ఓంకార్ నందో, సాధ్వి అనితాదేవి తీర్మానించారు. సమావేశంలో మహేంద్రగిరి పరిరక్షణ కమిటీ అధ్యక్షులు భాస్కరతీర్థ స్వామి లక్ష్మీబాబా, బాలముకుంద కేంద్రం నిర్వాహకులు నిత్యానంద చౌదురి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం


ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర స్వయం సేవికలు

జయపురం: స్థానిక శ్రీజగన్నాథ్ మందిరం ప్రాంగణంలో రాష్ట్ర స్వయం సేవిక ప్రవేశ, ప్రబోధ రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. మహిళలకు కర్రసాములు, విన్యాసాలు నేర్పించారు. ఈ నెల 12 నుంచి ఈ శిక్షణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంచాలిక పి.శాంతాదేవి, ఉత్కళ క్షేత్ర పరిచాలిక లౌతిక పాఢీ, జయపురం ప్రాంత కార్యవాహిక ఆరతీ బొయిసాయి, సూతపడే, బబిత సాహు, పూజ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నివారణకు చర్యలు

కంచిలి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం మీదుగా గంజాయి రవాణా నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్. జైభీమ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మండలంలో జాడుపూడి కాలనీ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చే బస్సులు, ఇతర భారీ వాహనాలు, కార్గో కంటైనర్లు, ఇతర వాహనాల్ని ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎవరైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది కాంతారావు, యోగేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'వారికి శిక్ష పడాల్సిందే'

శ్రీకాకుళం క్రైమ్ : తల్లి తనను వేధించిందని, కన్నతండ్రిపైనే అభాండాలు మోపేలా మాయ చేసిందని ఓ బాలిక విలేకరుల సమావేశం పెట్టి ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి చేసిన పనికి తన తండ్రి కూడా నరకం చూశారని విలపిస్తూ చెప్పింది. శ్రీకాకుళానికి చెందిన ఓ బాలిక ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. తన తల్లితో పాటు ఆమె ప్రియుడికి శిక్ష పడాల్సిందేనని కోరింది. ఆమె చెప్పిన వివరాల్లోకి వెళ్తే.. తన తండ్రి మోటార్ ట్రావెల్స్ నడుపుతుంటారని, ఆయన వద్ద పనిచేసిన వ్యక్తితో తన తల్లి మూడేళ్ల నుంచి సన్నిహితంగా మెలుగుతోందని, అప్పట్లో తనను భయపెట్టి తండ్రిపైనే తప్పుడు పోక్సో కేసు పెట్టించిందని బాలిక చెప్పింది. అంతేకాక నిత్యం తల్లి ప్రియుడు వచ్చి తనపై తప్పుడుగా ప్రవర్తించేవాడని, నాన్న అని పిలవమనేవాడని, ఈ విషయం తన తల్లికి చెబితే తప్పేమీ లేదు, అలాగే పిలవమని ఒత్తిడి చేసేదని చెప్పింది. ఈ విషయం తట్టుకోలేక పక్కింటి వారి ఫోన్ తీసుకుని తన తండ్రికి జరిగిందంతా చెప్పానని, తల్లి వద్ద నుంచి తండ్రి వద్దకు పారిపోయానని తెలిపింది. ఇదే విషయంపై బాధితురాలి తండ్రి మాట్లాడుతూ తన భార్య కుమార్తెను బెదిరించి తనపై తప్పుడు కేసు పెట్టి 45 రోజులు జైలు శిక్ష పడేటట్లు చేయడమే కాక స్లో పాయిజన్ బాటిల్ ఒకటి రెండేసి చుక్కలుగా ప్రతిరోజూ అన్నంలో కలిపి విష ప్రయోగం చేసేదని, తద్వారా తన శరీర అవయవాలు పాడయ్యేలా చేసి చంపేసి తన ఆస్తిని, డబ్బులను కాజేయాలని చూసిందని ఆరోపించారు. తన కోరికలు తీర్చుకునేందుకు కుమార్తెను కూడా బలివ్వాలని ప్రయత్నించిందని, దీనిపై ఎచ్చెర్ల పీఎస్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరారు.

'ఒడియా టీచర్ల పోస్టులు భర్తీ చేయాలి'

సోంపేట: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర పాఢి అన్నారు. సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర నూతన ప్రభుత్వాలకు అభినందనలు తెలిపారు.

నష్టాల్లో పైనాపిల్ యూనిట్లు

పర్లాకిమిడి: ప్రస్తుత సీజన్‌లోవిరివిగా లభించే పైనాపిల్ పండ్లకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదని సిందిబాలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన పైనాపిల్ ప్రోసెసింగ్ యూనిట్ ఇప్పటికే మూలపడింది. మరికొంతమంది మహిళా గ్రూపులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో పైనాపిల్ ప్రోసెసింగ్ చేపట్టి రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు తరలిస్తున్నా లాభాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని చెబుతున్నారు. వీరంతా పైనాపిల్‌ను చక్రాల మాదిరిగా కోసి సోలార్ ప్యానెల్స్ సహాయంతో ఆరబెట్టి కేక్స్ తయారు చేసి కటక్, భువనేశ్వర్ వంటి ప్రాంతాలకు పంపుతున్నారు. జిల్లాలో మూడు రకాల పైనాపిల్ పండ్లు పండుతున్నాయి. ఒకటి సాధారణ రకం, క్వీన్ రకం, మరొకటి హైబ్రిడ్ రకం. ఒక పండు ఖరీదు టోకున రూ.13, రూ.14లకు పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వమే జీవికా మిషన్ ద్వారా రాయితీలు కల్పించాలని సింధిబా గ్రామానికి చెందిన మహిళా గ్రూపు ప్రోసెసింగ్ యూనిట్ అధ్యక్షురాలు కుమారీ గోమాంగో కోరుతున్నారు.


ప్రోసెసింగ్ యూనిట్‌లో పైనాపిల్ కాయలు

ఆర్గానిక్ విధానంలో సాగు..



పశ్చిమ బెంగాల్‌లో సిలిగురి మాసంస్థ పర్యటించగా.. అక్కడ రైతులు కార్బన్ ఎరువులు వేసి ఎకరాకు రూ. 60వేల నుంచి రూ. 70 వేలు సంపాదిస్తున్నారు. గజపతి జిల్లాలో ఆర్గానిక్ విధానంలో రుచికరమైన పంట పండిస్తున్నా సరైన లాభాలు ఉండటం లేదు.
– అడ్డాల జగన్నాథరాజు, సి.సి.డి.సంస్థ కార్యదర్శి


బరంపురం తరలిపోతున్న పైనాపిల్ పంట


పైనాపిల్ పంటను కోస్తున్న గిరిజన రైతు


పైనాపిల్ చక్రాలను ఆరబెడుతున్న మహిళ


సింధిబాలో నిరుపయోగంగా పైనాపిల్ ప్రోసెసింగ్ యూనిట్

క్లుప్తంగా

ఒరిగిన ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం



పానుగుటివలస సమీపంలో గోతిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

రాజాం : రాజాం నుంచి సంతకవిటి వైపు ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు పానుగుటివలస దాటిన వెంటనే రోడ్డుపక్కన ఉన్న గుంతలో ఒరిగిపోయింది. వారం రోజుల కిందట టెలిఫోన్ లైన్ల నిమిత్తం తవ్విన గోతులు సక్రమంగా పూడ్చకపోవడంతో వర్షాలకు నీరు చేరి గోతులు పెద్దవిగా మారాయి. ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదవశాత్తూ గోతిలో ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఇదిలా ఉంటే ఒరిగిన బస్సును బయటకు తీయడంలో అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో రాజాం - సంతకవిటి రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

చేపల వర్తకులపై కేసు నమోదు



చేపల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

విజయనగరం: పట్టణంలోని పలు కూడళ్ల వద్ద నిర్వహిస్తున్న చికెన్, మటన్, చేపల దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం దాడులు చేపట్టారు. తూనిక రాళ్ల వినియోగించి వినియోగదారులను మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా వినియోగదారులు కూడా మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని.. ఇందులోభాగంగా నెలలో రెండు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. తూకంలో మోసాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం. దామోధరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆదినారాయణ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని చీపురువలస వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నంరాజువలస పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన రొంపల్లి ఆదినారాయణ శనివారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి చీపురువలస వైపు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణను మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం సాలూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి, అనంతరం తిరుమల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడు పాచిపెంట మండలం గురువునాయుడుపేట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీన్నర గంజాయి పట్టివేత

రామభద్రపురం: మండలకేంద్రంలో పోలీసులు ఆదివారం కేజీన్నర గంజాయి పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తున్నారన్న సమాచారం మేరకు తహసీల్దార్‌తో పాటు ఎస్సై జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మాటు వేశారు. గంజాయితో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిని కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామానికి చెందిన పెనుమల పూర్ణకిశోర్, విజయవాడ సిటీకి చెందిన చీపురుపల్లి ప్రేమ్‌కుమార్‌గా గుర్తించారు. వారు ఒడిశాలోని కొరాపుట్ పరిసర ప్రాంతాలలో గంజాయి కొనుగోలు చేసి విజయవాడకు అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ కూడళ్లలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఆదివారం చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా వస్తున్న వాహనాలను ఆపి, వాహనదారులు మద్యం తాగినదీ లేనిదీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అనంతరం మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం మత్తులో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనలు బేఖాతరు

● ఎన్‌ఓసీ లేకుండానే కొనసాగుతున్న పెట్రోల్ బంకులు, కోల్డ్ స్టోరేజీలు
● ఇష్టారాజ్యంగా నిర్వహణ
● నోటీసులకు స్పందించని యాజమాన్యాలు
● పెట్రోల్ బంకుల్లో కనిపించని సౌకర్యాలు, సేవలు
● కానరాని అధికారుల తనిఖీలు



ఎన్‌ఓసీ రెన్యువల్ చేసుకోని పెట్రోల్ బంకు

రామభద్రపురం: పరిశ్రమలు, గిడ్డంగులు, సామిల్లులు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకులు, దుస్తుల దుకాణాలు, సినిమా థియేటర్లు, హోమ్‌నీడ్స్, పాఠశాలలు ఇలా ప్రజలతో ముడిపడి ఉన్న సంస్థలేవైనా స్థాపించి కొనసాగించాలంటే సంబంధిత యాజమాన్యాలు ముందుగా అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సిందే. అలాగే ఆయా విభాగాల అనుమతులు కూడా తీసుకోవాలి. ఒకవేళ అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకుంటే ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలి. అయితే ఈ నిబంధనలేవీ పట్టించుకోకుండా మండలంలో కొన్ని సంస్థలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల కిందట సాలూరు రూట్‌లో ఏర్పాటు చేసిన పెంట్రోల్ బంకులు మొదట్లో అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నారు. అయితే ఆ అనుమతులు ముగిసిపోయి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ రెన్యువల్ చేసుకోలేదు. సదరు యాజమాన్యాలకు అగ్నిమాపక శాఖాధికారులు నోటీసులిచ్చినా స్పందించలేదని సమాచారం. పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలేమైనా జరిగితే ఎవరు బాధ్యులవుతారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలన ఊసేలేదు...

వాస్తవానికి బంకుల వద్ద ఏ రోజుకారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి.పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి..? ఎవరిని సంప్రదించాలి..? వారి పేర్లు, హోదా తెలియజేస్తూ ఫోన్ నంబర్లు నోటీసు బోర్డులో పొందుపరచాలి. కానీ కొద్ది బంకుల్లో మాత్రమే ఇటువంటివి కనిపిస్తుంటాయి. తూనికలు, కొలతల శాఖాధికారులతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు బంకులను తనిఖీ చేయాలి. సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి సైతం సందర్శించి పెట్రోల్, డీజిల్ నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇవేమీ జరగడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. అలాగే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేటప్పుడు అన్ని సదుపాయాలు ఉంటేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారులు ఇవేవీ చూడకుండానే అనుమతి పత్రాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కానరాని నిబంధనలు..

పెట్రోల్ బంకుల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. సగానికి పైగా బంకుల్లో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించవు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారే తప్ప కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. త్వరగా గమ్యం చేరాలనే వినియోగదారుడి ఆరాటం, అవగాన లోపం బంకుల యాజమాన్యాలకు కలిసివస్తోంది.

పెట్రోల్ బంకుల వద్ద కల్పించాల్సిన సౌకర్యాలు..

● పెట్రోల్ బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీరు సదుపాయం కల్పించాలి. దీనికోసం బంకు యజమాని ఆర్‌ఓ మెషీన్, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఒకవేళ ఏ పెట్రోల్ బంకులోనైనా తాగునీటి సౌకర్యం లేకపోతే వినియోగదారుడు చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు.
● వినియోగదారులు అత్యవసర, అనారోగ్య సమయాల్లో ఫోన్ చేసుకునేందుకు పెట్రోల్ బంకుల వద్ద ఉచిత ఫోన్ సౌకర్యం కల్పించాలి. వాహనదారులు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే ఆ సమయంలో వాహన చోదకుడు వద్ద మొబైల్ ఫోన్ లేకపోతే..సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు దగ్గరకు వెళ్లి అక్కడ ఉన్న ఉచిత టెలీఫోన్ ద్వారా వినియోగదారుడు కాల్స్ చేసుకోవచ్చు.
● అన్నిటికంటే ముఖ్యంగా పెట్రోల్ బంకుల వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్లు లేకుంటే సంబంధిత చమురు కంపెనీకి లేదా పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లకు ఫిర్యాదు చేయొచ్చు.
● ప్రతి పెట్రోల్ బంకు వద్ద ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. వినియోగదారులు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకోవచ్చు. యాజమాన్యం ప్రథమ చికిత్స కిట్టు ఇవ్వడానికి నిరాకరిస్తే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.
● పెట్రోల్, డీజిల్‌కి సంబంధించి బిల్లు ఇవ్వడానికి నిరాకరిస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎయిర్ మెషీన్ ఏర్పాటు చేసి అవసరమైన వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి.
● అలాగే ఫిర్యాదు బాక్స్ లేదా రిజిస్టర్ ఉంచాలి. ఇందులో వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. లేదంటే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను సందర్శించి ఫిర్యాదు చేయవచ్చు.

నిబంధనలు పాటించాల్సిందే...

పెట్రోల్ బంకు యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. తాగునీరు, మరుగుదొడ్లు, ఉచితంగా గాలి వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. అధికారులు ఎప్పటికప్పుడు బంకులను పరిశీలిస్తున్నారు. కనీస సౌకర్యాలతో పాటు వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు.

– ఎ. సులోచనారాణి, తహసీల్దార్, రామభద్రపురం

నోటీసులిచ్చాం..

సామూహిక ప్రజలతో ముడిపడి ఉన్న సంస్థలేవైనా అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఎన్‌ఓసీ తీసుకోవాలి. బాడంగి అగ్నిమాపకకేంద్రం పరిధిలో ఎన్‌ఓసీ లేని పరిశ్రమలకు నోటీసులిచ్చాం. అలాగే సాలూరు రూట్‌లో ఉన్న పెట్రోల్ బంకులు ఎన్‌ఓసీ రెన్యువల్ చేసుకోవాలని నోటీసులిచ్చాం. ఇంతవవరకు వారి నుంచి స్పందన లేదు. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– బీఆర్ నాయుడు, అగ్నిమాపకశాఖాధికారి, బాడంగి

నేల బావిలో పడిన ట్రాక్టర్



క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను పైకి తీస్తున్న దృశ్యం

● డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సూర్యనారాయణ

లక్కవరపుకోట : నేలబావిలో ట్రాక్టర్ పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని రేగ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ అప్పలరాజుకు చెందిన ట్రాక్టర్‌కు అదే గ్రామానికి చెందిన కోన సూర్యనారాయణ (43) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రేగ గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో దుక్కు చేపట్టేందుకు సూర్యనారాయణ ఆదివారం ఉదయం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో దుక్కు చేపడుతుండగా.. వెనక్కి మళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి వెనుకనే గల నేలబావిలో పడిపోయింది. అక్కడున్న వారు వెంటనే స్పందించి గట్టిగా కేకలు వేయడంతో పాటు విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో రేగ, కళ్లేపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి బావి లోనుంచి ట్రాక్టర్ తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొత్తవలస నుంచి భారీ క్రేన్‌ను తీసుకువచ్చి అతి కష్టంమీద ట్రాక్టర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ సూర్యనారాయణ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఆడపిల్లలకు వివాహాలు జరిగాయి. ఇంటి పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. హెచ్‌సీ త్రిమూర్తులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



జలాశయంలో నాగేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్లో) నాగేశ్వరరావు (ఫైల్)



గంట్యాడ : మండలంలోని తాటిపూడి జలాశయంలో పడి ఒకరు మృతి చెందారు. అయితే ఈ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన జలగడుగుల నాగేశ్వరరావుకు ఎస్.కోటకు చెందిన వరలక్ష్మితో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ నెల 14న భార్యతో కలిసి అత్తవారింటికి వచ్చిన నాగేశ్వరరావు తాటిపూడి జలాశయానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో నాగేశ్వరరావు భార్య ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం తాటిపూడి జలాశయంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి చూడగా.. నాగేశ్వరరావు మృతదేహంగా గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తూ జలాశయంలో పడిపోయాడా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేశామోచ్..!



బొండపల్లిలోని రామన్న సాగరంలో ఆకట్టుకుంటున్న సైబీరియా పక్షులు

● కనువిందుచేస్తున్న సైబీరియా పక్షులు
● ఏటా జూన్ నెలలో వచ్చి డిసెంబరు వరకు విడిది
● కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా రాక



రామన్న సాగరంలో మేత మేస్తున్న సైబీరియా వలస పక్షులు

బొండపల్లి: వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి వివిధ దేశాలు దాటి క్రమం తప్పకుండా జిల్లాలోని బొండపల్లి ప్రాంతానికి వలస వస్తున్న విదేశీ సైబీరియా దేశ వలస పక్షులు ఈఏడాది కూడా తిరిగి వచ్చి సందర్శకులకు కనువిందు చేస్తూ ఆకట్టుకుంటున్నాయి. పొడవాటి ముక్కు, కాళ్లు, భారీ ఆకారంతో పాటు, శరీరమంతా తెల్లని వెంట్రుకలు, మెడ దగ్గర మాత్రం తెల్లని వెంట్రుకలతో పాటు ఎరుపు రంగు వెంట్రుకలు కలిసి చూడగానే ఇట్టే ఆకట్టుకునే సైబీరియా దేశానికి చెందిన పక్షులు కొన్ని సంవత్సరాలుగా బొండపల్లి మండలానికి చేరుకుని విడిది ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ పక్షులు సైబీరియా దేశం నుంచి ఏటా జూన్ నెలలో వలస వచ్చి వేసవి కాలంతో పాటు వర్షాకాలం ఇక్కడే ఉండి తిరిగి తమ సొంత దేశానికి వలస వెళిపోతుంటాయి.ఇది క్రమం తప్పకుండా జరుగుతోంది.

చెరువుల్లో ఆహారం సేకరణ

సైబీరియా పక్షులు మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న రామన్న సాగరం చెరువులో లభించే చిన్న, చిన్న చేపలతో పాటు ఇతర ఆహారాన్ని సేకరించుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉండి సాయంత్రం గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామంలో గల చింత చెట్లను ఆవాసంగా చేసుకుని రాత్రంతా అక్కడే ఉంటాయి. తిరిగి ఆహారం కోసం ఉదయాన్నే చెరువు వద్దకు రావడం ఆరు నెలల పాటు జరుగుతుంటుంది.

పిల్లలు పెద్దవయ్యాక వలస

ఇక్కడికి ఈ పక్షులు జూన్ నెలలో వచ్చి సెప్టెంబర్ కల్లా గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి, అవి పెద్దవై ఎగిరే అవకాశం ఉన్నంత వరకు అంటే డిసెంబరు వరకు ఒక్కడే ఉండి తిరిగి పిల్లలతో సహా వాటి సొంత దేశం సైబీరియాకు వలస వెళ్లిపోతాయి. ఈ పక్షులు వచ్చాయంటే తమకు మంచి జరుగుతుందని ఈ ప్రాంత వాసులు భావిస్తుంటారు.

హాని చేస్తే జరిమానా విధింపు

ఈ పక్షులకు లోగిశ గ్రామం, చుట్టుపక్కల గ్రామాల వారితో పాటు బొండపల్లి చుట్టు పక్కల గ్రామాల వారు ఎటువంటి హాని తలపెట్టరు. అలాగే వాటికి ఎవరూ హాని చేసినా, వాటిని పట్టుకున్నా జరిమానా విధించాలని ఇక్కడి వారే కట్టుబాటు పెట్టుకుని పక్కాగా అమలు చేస్తున్నారు. ఇక్కడ జూన్ నెల నుంచి ఎండల తీవ్రతతో పాటు,ఆ తర్వాత వర్షాలు పడడం వల్ల సైబీరియా పక్షులకు ఇక్కడి వాతావరణం గుడ్లు పెట్టి పిల్లలు పొదిగేందుకు అనువగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే క్రమం తప్పకుండా ఈ పక్షులు ఏటా వలస వస్తున్నాయని భావిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

'ప్రియ'మైన టమాటో

● అమాంతం పెరిగిన ధర
● కొనుగోలు చేయలేకపోతున్న సామాన్యులు



పార్వతీపురం: టమాటో ధర పైపైకి ఎగబాకుతోంది. ప్రస్తుతం కిలో టమాటో హోల్‌సేల్‌గా రూ.80కు లభిస్తుండగా, రిటైల్‌గా రూ.100కు విక్రయిస్తున్నారు. పల్లెల్లో రూ.110నుంచి రూ.120 వరకూ వర్తకులు అమ్ముతున్నారు. కొద్ది రోజుల నుంచి టమాటో ధర కిలో రూ.40లోపు ఉండగా ఒక్కసారిగా పెరిగింది. దీంతో సాధారణ కుటుంబాలు ప్రస్తుతం టమాటోను కొనలేని పరిస్థితి కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే ఆస్కారముందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా పంట దిగుబడులు తీవ్రంగా తగ్గిపోవడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కాకపోవడంవల్ల ధరలు పెరుగుతున్నాయని వర్తకులు చెబుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరునికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని తెలగవీధి సత్యానారాయణపురం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షికోత్స వం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకా లు, ఉత్సవ సంకలనం, అంకురారోహణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమా లు చేపట్టారు.

జలకళ



నీటితో కళకళలాడుతున్న నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి: మండలంలోని రంగరాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. గడిచిన రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎత్తైన ప్రాంతాల నుంచి ఆనకట్టలోకి పెద్దఎత్తున నీరు వచ్చి, చేరుకుంది. ఆదివారం నాటికి ఆనకట్టలో నీటిమట్టం పెరిగిందనిఅధికారులు చెబుతున్నారు.

టీకాలతో వ్యాధులు దూరం..

● ప్రతి సోమ, గురువారాల్లో ఉచితంగా టీకాలు
● ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా నిల్వలు



పూసపాటిరేగ పీహెచ్‌సీలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ : వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భం దాల్చినప్పటి నుంచి అప్పుటే పుట్టిన చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాలలో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న ఉచిత టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమ, గురువారాల్లో గర్భిణులు, చిన్నారులు, వయోజనులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.

వాక్సిన్లు వేసేదిలా..

● గర్భిణిగా నిర్ధారైన మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు వేసుకోవాలి.
● అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
● 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
● ఆరు, 14 వారాలలో ఐపీపీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వ్యాక్సిన్ వేయించాలి.
● తొమ్మిది నెలలు నిండి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ -ఎ చుక్కలు వేయించాలి.
● 16 నెలలు నిండి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్ విటమిన్- ఏ వేయించాలి.
● ఐదేళ్ల పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
● 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీటీ) వేయించాలి
● తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్-ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
● 60 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న వ్యక్తులకు బీసీజీ టీకాలు వేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. తాజాగా వచ్చిన బీసీజీ టీకాలను క్షవ్యాధి ఉన్నా, 60 సంవత్సరాలు పైబడినా వేయించుకోవాలి. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేష్‌వర్మ, వైద్యాధికారి, పూసపాటిరేగ పీహెచ్‌సీ